# తెలుగు పొదుపు సుకీబవ!

అన్ని గుణాలు అన్నిందాలా సమంగా ఉంటే? ఎట్టుంటాయిలే? ఉంటే ఆపె మాబాశాలి ఎట్టవితింది? నేనెందుకిట్టా రాస్తాను? ఉంటే మాత్రం– ఎవురి బిడ్డయితే ఏమి? ఉణ్ణింది ఉణ్ణెట్టుగా చెప్పుకోవాల! నిద్దర పడకమింద ఉండంగానే బీరుగళాసంత గళాస్తో కాపీ తెచ్చి యిచ్చేది. ఆ పొద్దు ముక్కు చెంబుతో తెచ్చి నా ముందర పెట్టె!

ఆ ముక్కుచెంబును చూస్తానే నేను ముక్కు లెగరెయ్యాల్సింది. అయితే దిక్కులు చూసినా. ఆడేడా వాడు కంట్లో పడక పొయ్యేకుందికి చూపు పడక మిందికి మళ్లించినా. పడక మింద గూడా వాడవుపించలా!– మరేందీ ముక్కుచెంబు యవ్వారం?– ముడి యీడలా.

వాడుండాడే నా మనవుడు. ఒకేళకాడ మెలకవ వచ్చేసిందంటే లేచి సక్కా వచ్చి నాపక్కలో పొణుకుండేది కద్దు. ఆ పొద్దు గూడా వాడు అట్టా మాదిరేమన్నా వచ్చి పొణుకున్నాడేమో? ఈ ముక్కు చెంబుతో కాపీ ఆపిలగాడి కోసరవేమో? అనుకుందామంటే వాడు అవుపించలా. అందుకే–

"ఇదేందే? ఎవురి ముక్కుల కాడ పెడదామనే ఈ ముక్కు చెంబుతో కాపీ దెచ్చినావు. ఇదేం అలప సొలపమైన పొణమనుకున్నావా? ముంతలు... ముంతల్తో తాగిన బతుకులు గదే? మా తాత పెదరామిరెడ్డి పరగడపన పండ్లుగూడా తోమకుండా తాగెకదే? ఏంది?

ఈతకల్లు. లేకుండా బోతే టెంకాయికల్లు. మాతాతల తరం అట్లా గడ్సిపాయ. ఇంక మా అయ్య తరానికి రా. దుర్గం రాజుల కయ్యిలో మా అయ్య మా అన్న మడకలు కట్టి దున్నతా ఉంటారు. పొద్దుగూట్లో పడేదానికి యింకా బారడు పొద్దు ఉంటిందనంగా మా జయమ్మక్క సుమారుపాటి కడవంత దుత్తతో తెస్తింది. ఏంది? చిట్టుడుకునీళ్లు! ఆ దుత్త కంట్లోపడ్తానే మాఅయ్య మాఅన్న మడకలు నిలిపేస్తారు. ఉడుకుడుగ్గా ఒక్కొక్క ముంత మార్సి మార్సి కొట్టొడుస్తారు. ఇంక చూస్కో! అదెటుమంటి బళ్లికైనా సరే ఉచ్చులు తెంపుకోని పరిగిత్తా బార్తం మిట్టకాడికి పాయ్ తిరిగి చూడాల్సిందే కదా? ముండ్ల సందన పుట్నె రోజాపువ్వును అంత మురెపెంగా చూసుకుంటారే? ఎంతదా పల్లెకొంపల్లో పుట్టేమాత్రం అంత హీనంగా కనపడ్తా ఉండానా నీ కంటికి?'' అని అడగదామని తలపైకెత్తినా. ఎత్తిన తల ఎత్తినట్టే నిలబడిపాయ. తెర్సినకండ్లు తెర్సినట్టే ఉండిపాయ!

అప్పుడెప్పుడో నేను బొత్నేలు తొక్కి కట్టిన బొట్టుమాదిర్తో సిబ్బిరేకంత అట్టముక్క మెళ్లో యాలాడ్తా ఉండాది. ఆ అట్టమింద వక్కాముక్కల 'తెలుగు పొదుపు!' అని రాసి పెట్టుండాది.'

అప్పుడు కసక్కమని నాలిక కొరుక్కుణ్ణా!

''అవ్ గదా మరి? 'అన్న' పొదుపమ్మ పొదుపో! అంటే ఆడపడుచులు 'అవునన్న అవునో!' అని వంత పాడకుండా ఉంటారా? అయితే ఈ పొదుపు యవ్వారం కాపీతోనే మొదులయ్యిందే? ఇదింక యాడిదాకా పోతిందో? ఏమో?'' అని మణుసులో పడేకుందికి గుండె గెబీమనె! అయినా తెపరాయించుకోని–

''ఇదేందిదే? తెలుగు పొదుపంటే తెలుగును పొదుపుగా వాడుకోమని గదా అర్తం? నువ్వు కాపీకాడ గూడా...'' అని అన్నానో లేదో,

''సాల్సాలు. ఆడికి నిలిపే నీకత. యాసణ్ణం పడేదానిగ్గూడా ఒక యాళాపాళా ఉండాల!'' అంటా ఒక తిప్పు తిప్పె.

ఆ తిప్పుతో మెళ్లో యాలాడ్తావుండె అట్టతుంటకు తిక్కరేగె! అది ఎదమింద ఎదుర్లేకుండా కొమ్మమింద ఉడత ఎగిరెగిరి దూకినట్టు ఎగిరెగిరి పడ్తా ఉండాది. దాన్ని గెమనించినా. ఎవురికతో ఎందుగ్గానీ నా మణుసే ఎట్టెట్నో పాయ. నా దొంగచూపుల్ను మా బాశాలి కనిపెట్టేసింది.

''అందులో పసలేక పాయ్‌నా అర్లో మంచం ఎయ్‌మన్నాడంట ఆడెవుడో ఒక మొగోడు!...''

''అంటే నాలో పసలేదంటావా?''

''రామరామ! అంత మాటంటే నాకు నిద్దరబొయ్యేటప్పుడు రొండు కండ్లు కనిపిస్తాయా? ఈ యాపాడం అట్టుండాదంటి గానీ... నువ్వులెయ్. లేసి తొందరగా తెవులు. పాయ్‌న వారంగాక అంతకు ముందువారం గదా నేను చెప్పింది. గోయింద రాజులు

గుడి గోపరాన్ని తెచ్చి యింటిముందరేమన్నా పెట్టమంటినా? బిడ్డ అడగతా ఉండేదొక పుస్తకం. ఆ లైబ్రీ కాడికి పాయ్ తెమ్మంటి. ఇద్దో అద్దో అంటానే ఉండావు. ఇంటిపని గదా? అదే ఊలోళ్ల పనైతే ఉరికురికి చేద్దువు!''

పాగు పాకాన పడ్తానే వొంచుకోవాల. ముదిర్తే ముద్దకురాదు. మా బాశాలి మాటమాత్రం పాకాన పడకముందే యిడిపించుకోవాల. లేకుండాపోతే పట్టే దానికి పగ్గాలే ఉండవు. అందుకనే గమ్మున పైకి లేచినా. స్తానం పానం అయిందనిపించినా. లైబ్రీకి పాయ్యేసి వస్తానని చెప్పేసి ఎలబార్నా! ఎగబడి పోతే ఏముండాది? నాలుగ్గాళ్లమండపం ఉండాది. నాలుగ్గాళ్లమండపం కాడ ఎప్పుడూ వద్దన్నా నలుగురుంటారు. ఆ నలుగురికి నాలుగు నాలికలు. ఆ నాలుగు నాలికలు నలభైయారు యిదాలు. ఆ మాటల్లో పడిపోతే యిల్లూవొళ్లూ రొండూ మర్సిపోతాం. మర్సిపోతే యింకేముండాది. మా బాశాలి ఉండనే ఉండాది. దోవనపాయ్యే జగడం యింటిదాకా ఎందుకనుకుంటి. సక్కా లైబ్రీకి పోతే సరిపోతిందని దిగబడి పోతా ఉండా.

నేనుదిగబడి పోతావుంటే వాడా రామ్మూర్తి ఎగబడి వస్తావుండాడు. వాణ్ణి చూసి శానా దినాలైపాయ. గుమ్మిడి పొండు మాదిర్తో గుమ్మటంగా ఉణ్ణె మణిసి గోగు పుల్లకన్నా అద్దోనంగా అవుపిస్తా ఉండాడు. ఎదురుంగా వస్తావుంటే తప్పించుకోని పాయ్యేదాని కెట్టవితింది? నిలబడ్తి. నన్ను చూసి వాడూ నిలబడె. ఆడిదాకా బాగనే ఉండాది. ఆ తరవాత–

''ఏమిరా శానా చిక్కి పాయ్‌నావే?'' అని అడిగితే–

''చీ చీ! అదేందది పెట్ట మారికూతలు కూస్తావుండావే? మనమా? హె హె! ఈ జల్మానికి వొకడి చేతిలో చిక్కేదుండాదా? ఇది జరిగే పనిగాదు. అది సరే గానీ... నువ్వు నిలబడిందెందుకు చెప్పు.'' అనె.

నాయాలికింకా చింత చచ్చినా పులుపు చావలా!

''అదేందిరా పెద్ద గాలితోల్తే పేరూరుదాకా కొట్టుకోని పాయ్యేటట్టుండావ్. గుర్తు పట్టేది గూడా శానాకష్టంగా ఉండాది. చిక్కిపోలేదని యాసణ్ణం పడ్తా వుండావే?''

''అదా? వాడా టెయిలరుండ్లా? వాడొక శాతగాని ఎరిముండ. చొక్కాయి శానా లూజుగా కుట్టేసినాడు. ఏందిరా యిదంటే? కింద పణ్ణా పై చెయ్యి నాదే అన్నెట్టుగా యిప్పుడదే పేషన్ అంటాడు. ఆ మాత్రం కనుక్కోలేకుండా పాయ్‌నావంటే దేన్కైనా మంచిది. ఎంటనే నువ్వు ఒక కంటివైదిగుడి దగ్గిరికి పాయ్యేది మంచిదనుకుంటా!''

''ఒరే వొరే! పులగరా పులగరా పోలిగా అంటే 'ఆకాశం బొక్కపడ్తే మా అయ్య చీమతోలు తీసుకోని పొయ్యుండాడు కుట్టేదానికి!' అన్నెట్టుండాది గదరా నువ్వు పులిగేది. నా చూపు సుద్దంగానే ఉండాది. నీ బుద్దే...''

''అయితే సరేనబ్బా! అప్పుడంతా నీయమ్మా మొగుడిసొత్తు పెట్తావుంటివి. తినేసి లావుగాలంబుగా ఉంటి. ఇప్పుడు పెట్టకుండా బోతివి. నేనిట్టయిపోతి.''

దుడ్లుచ్చి తద్దినం కొనుకున్నట్టయ్ పాయ. నీకొక దండం. నువ్వు పడ్తావుండే యాసణ్ణానికి ఎయ్యిదండాలు. నువ్వు పదరా అబ్బారే?'' అని రొండు చేతులెత్తి వాడికొక దణ్ణం పెట్టేసి ఎలబారబోతే, వాడు రొండు చేతులు పట్టుకోని నిలబెట్టి-

''అంత కోపగించుకుంటే నేనేం చేసేది? అయినా నీకు తెలవదని గాదు. ఈ మణిసి జల్మం ఉండాదే అది శానా యిచ్చిత్రమయింది. లోపలొగిటి. బైటొగిటి. చెప్పే దొగిటి. చేసే దొగిటి. నా మటుకే తీసుకో. నిజింగా నేను చిక్కిపాయ్‌నా. అయినా మాటల్లో చిక్కిపోరాదని తపన. దీన్నేమంటారంటే డంబాచార మంటారు. ఈ దినాల్లో డంబాచారం లేకుండాబోతే మణిసి దమ్మిడిగ్గూడా పనికిరాడు.''

''అది సరేరా! నే నడిగేదేంది? నువ్వు చెప్పేదేంది?''

''వస్తావుండా! వస్తావుండా!!... ఆడికే వస్తావుండా. మణిసికి రాకుండా కష్టాలు మానికా వస్తాయంటారు. అనే దానికేముండాది? లేసుగా అనేస్తారు. అయితే కష్టాల్లో చిగులుకున్నెప్పుడు మాత్రం కుమిలి కుమిలి కూరాకైపోతారు. మనం అట్టా కాగూడదను కున్నాం. చచ్చేది నిజం. బతికేది అపద్దం అని తెల్సుకున్నాం. కాబట్టే యాడస్తా బతికే దానికంటే నవ్వతా చచ్చి పోవాలనుకున్నాం!''

''అదేందిరా అట్టంటా ఉండావే? పెద్ద పెద్ద ఆసిపత్రులుండాయి. కొత్త కొత్త మందులా? రకరకాలుగా కనిపెటేస్తా ఉండారు. అదెటువంటి జబ్బయినాసరే! చస్తే బతికించేదొగిటే శాత గాలేదు గాని- మిగతావన్నీ మటుమాయం చేసి పారేస్తా ఉంటే...''

''నిజిమే! నిజిమే! అంగిట్లో అన్నీ ఉండాయ్. అల్లుడి నోట్లో శని ఉండాదన్నెట్టు వాడా డ్వాక్టర్ ఆడ చెయ్‌బెట్టె. ఈడ చెయ్‌బెట్టె. ఆడ పిసికె. ఈడ పిసికె. నూర్రూపాయిలు గుంజుకుండె. మాతర్లు రాసిచ్చె. మూడుపూట్లు మూడు మాతర్లు మింగమనె. వాడట్టంటే మాయింటామె ఎట్టనిందో తెల్సా? దినానికొకే మాత్ర మింగమనె!

''అదెట్టా కుదిర్తిందే?'' అంటే-

''అదంతే! పని చేసే మాత్ర లెన్నిగావాల? వొగిటి మింగితే సాల్దా?'' అనె.

''అప్పటికి డ్వాక్టరు మాటేంగావాల?'' అంటే

''అయితే అన్న మాటేంగావాల?'' అని ఎదురు తిరిగె.

''అన్న ఏమన్నా డ్వాక్టరా?'' అంటే-

''అవునో కాదో నాకెందుకు? అన్న మాటంటేమాటే. అన్న పొదుపు పాటించమంటే మనం కాదనే దాని కవితిందా? మందులో విందులో యింకెందులో అయినా సరే. పొదుపు పాటించాల్సిందే!'' అనె.

''ఈ పొదుపుతో నాచావు నేను చస్తా ఉండాన్రా తండ్రీ!'' అంటా ఏడుపు మొకం పెట్టుకోని వాడు ఎగబడి పాయ.

ఈ ఆడోళ్లుండారే ఎంతకైనా తగుదురబ్బా? ఎక్కించాలనుకుంటే సిమ్మాసనాన్ని ఎక్కించేస్తారు. దించేయాలనుకుంటే బెమ్మదేవుడడ్డుపణ్ణా నిలపరు. దించేస్తారు. రాజ్జాలు కొల్లబొయ్యిందీ యీళ్లతోనే. కోలుకునిందీ యీళ్లతోనే. అయినా ఆడేణ్ణో అయిద్రాబాద్‌లో కూసోని అన్న పొదుపు అన్నాడోలేదో? అప్పుడే ఈళ్లు మొగుళ్లనే అదుపులో పెట్టేస్తా ఉండారే! అని ఆలోచించుకుంటా ఆ లైబ్రీ కాడికి పోతి. ఆడ కత చూడబోతే యింకా యిపరీతంగా ఉండాది.

'అయిదు పత్రికలుంటే అయిదూ ఎందుక్కొనాల? అన్నిట్లో రాసుండేది వొగిటే రాతగదా? వొగిటికొంటే సరిపోతిందిగదా? అని ప్రెబుత్వం పొదుపు పాటించ మనిందట. ఏద్దైనా వొగిటి కొనమంటే ఏది కొనాలని లైబ్రీఅతికార్లు మల్లగుల్లాలు పడీ పడీ నెత్తిన చేతులు పెట్టుకోని ఆలోచించినారంట. ఆలోచించగా ఆలోచించగా వాళ్లకొక ఆలోచన తట్టిందంట. ఇటుమంటి యాసకాటల్లో లాట్రీయేసి ఒకానొక ప్రెజానాయకుణ్ణే లాట్రీ తీమన్నారంట. ఆ లాట్రీలో వచ్చిన ఆ ఒక్క పత్రికనే కొన్నారంట!

పత్రిక వొగిటి. చదివే వాళ్లొక గుంపు. ఇంక చూస్కో నాసామిరంగా! ఆవొక్క పత్రికనే పేజీలు పేజీలుగా చింపుకుణ్ణారు. ఒకొక్కడు ఒకొక్క పేజీ శాతబట్టుకుణ్ణారు. ఆ ఒకొక్కడి చుట్టూ ఒక గుంపు చేర్నారు. నిక్కినిక్కి చూస్తా కొందురు. తొంగి తొంగి చూస్తా కొందురు... కింద కూసోని యింకొక పక్క పేజీ చదవతా కొందురు!...

అది చూస్తావుంటే నా కండ్లల్లో కనకాంబరాలు పూసె!

ఇంకేంగావాల? దేశింలో యిట్టా పొదుపు పాటిస్తే ఎంత మిగిలి మిట్ట పడిపోతిందో? అట్టా మిగిలి మిట్టనబడిపోతే ఆ మిట్టన పడిందంతా పల్లా నుండే వాళ్లకు పంచి పెడ్తే?– నా గుండికాయి ఊదిన బెలూనై పాయ. వచ్చిన పని గుట్టెక్కి పాయ. ఇంకా యాడేడ ఎట్టెట్టా పొదుపు పాటిస్తా ఉండారో చూద్దామని ఎలబార్తి. నేరుగా మండలాపీసుకు పోతి!

ఆ ఆపీసు ముందరొక తిరణాల జరిగినట్టు ఉడ్డలుడ్డలుగా జనం. అయితే ఆపీసుమాత్రం కడిగి తోసినట్టు సుబ్బరంగా ఉండాది. అంత పెద్ద ఆపీసులో ఒకేవొక్క కుర్చీ. ఆ కుర్చీ మింద ఒకడు కూసోని వంచిన తలెత్తకుండా ఒక్కమోపన రాసిందే రాసిందిగా ఉండాడు. ఆ కుర్చీకి ఈ పక్కన యిద్దురు ఆ పక్కన యిద్దురు కాగితాలు శాతపట్టుకోని నిలబడుకోనుండారు.

''ఏందయ్యా ఈ సీను?'' అని అడిగితే–

''పొదుపయ్యా పొదుపు! పొదుపు పతకం కింద ప్రెబుత్వం కుర్చీలన్నీ లాక్కుండె. ఇద్దో యిదొగిటే మిగిలె. ఈడి పనైపోతానే నేను... నా పనైపోతానే అద్దోవాడు ఒకడి తరవాత యింకొకడు కూసోని రాసుకోవాల!'' అనె.

''బాగుండాది. బాగుండాది. యవారం శానా బాగుండాది!'' అనుకుంటా యిట్టా తిరిగిచూస్తి.

ఒకాయిన. బొన్లోయేసిన పెద్దపులి మాదిర్తో ఈ పక్కకాపక్కకు ఒక్క మోపన తిరగతా ఉండాడు. అయితే బొన్లోపులికి ఈయనకు వొగిటే వెత్తాసం. బోన్లో పులి సిగరెట్టు తాగదు. ఈయన మాత్రం దమ్ముమింద దమ్ము దుమ్ము రేపిచ్చేస్తా ఉండాడు.

''ఏందయ్యా నీబాద?'' అని అడిగితి.

''పొదుపయ్యా పొదుపు. డ్రాష్టు కుదించి రాయాల. లేకుండాబోతే కాగితాలు ఏస్టు. టైపు గొట్టేదీ ఏస్టు. అంతా యిట్ట ఏస్టయ్ పోతావుంటే ఎవురు మాత్రం వొప్పుకుంటారు? ఏ దేశిం మాత్రం బాగుపడ్తుంది. దానికోసరమే నాతిప్పలు నే పడ్తా ఉండా!'' అనె.

ఆయన పడ్తున్న తిప్పలకు దృష్టాంతంగా ఉంటలుంటలుగా నలిపేసిన తెల్లకాగితాలు పొదుగిడ్సిన కోడిపిల్లల మాదిర్తో మూలకొగిటిగా పడుండాయి.

నిద్దర పడకమింద ముక్కుచెంబుతో కాపీ!... నిజింగా కడుపులో ఎలికిలు లోడ్తా ఉండాయి. కాపీకతే ముక్కుచెంబు కాడికొస్తే యింక మద్దేణం కాడ తిండికత? ఎట్టుంటిందో ఆ రాముడికే యెరిక! అనుకుంటా ఎలబార్తి. నాలుగ్గాళ్లమండపం కాడి కొచ్చేకుందికి ముత్తారెడ్డన్న ఎదురు పడె. ఎదురుపడ్తానే ఏదోవొగిటి అనే మణిసి గమ్మున నిలబడుకుండె!

''ఏమన్నా? అరీగురీ మనకుండా అట్ట చూస్తా ఉండావే? నువ్వుగూడా పొదుపు పాటిస్తా ఉండావా? దానెమ్మా నాయాలిసీమ! మాటల్లో గూడా పొదుపేనా?''

''ఆ మాట నన్నడిగితే ఎట్టబ్బోడా? రేపో మాపో మన ముక్కెమంత్రి దిగబడబోతా ఉండాడంట. ఏకంగా ఎలీకాప్టర్‌లోనే. మన ఏడుకొండలవాడి పాదాలకిందుండే కోనేటికట్ట కాడనే మీటింగు. ఓం ప్రెదమంగా పొదుపు ఉద్దెమాన్ని గురించి మాట్లాడేదానికి వస్తా ఉండాడంట! ఆయన్నడుగు! ఏంచెప్తాడో వచ్చి నాతో గూడా చెప్పు. ఒరే నీపాసుగూల! అట్టపాయ్ ఆ కోనేటికట్టకాడ చూడుపోరా! ఆకాశిమంత పందిళ్లు!...''

ఎలికాప్టర్ మింద! ఆకాశిమంత పందిలికింద!!– తెలుగు పొదుపు సుకీబవ! అనుకుంటి. ●